## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న కొత్తపేట ఆర్డీఓ...



**ఆత్రేయపురం, జూన్ 18,(ప్రభాత వార్త)** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం గురువారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. శ్రీ స్వామివారి ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. కొత్తపేట ఆర్డీవో. జి.వి.వి. సత్యనారాయణ గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఆర్ అండ్ బి. డి ఈ. రాజేంద్రప్రసాద్, జిల్లా సర్వే, డి ఈ. ప్రభాకర్, మండల సర్వేర్ గంగాదేవి,వీఆర్వో. సురేష్, గ్రామ సర్వే రఘు తదితరులు ఉన్నారు.

## యాసలపు సూర్యారావు 14వ వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయండి గోడపత్రిక ఆవిష్కరణ



**పెద్దాపురం, జూన్ 18(ప్రభాత వార్త)**సిపిఎం నాయకులు, అభ్యుదయ కవి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కామ్రేడ్ యాసలపు సూర్యారావు వర్ధంతి సందర్భంగా జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోసుల కృష్ణబాబు, సీఐటీయూ మండలం అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ జూన్ 22 న జరిగే కామ్రేడ్ యాసలపు సూర్యారావు 14వ వర్ధంతి సందర్భంగా 20 వ తేదీన రక్తదాన శిబిరం, 21 వ తేదీన కవిసమ్మేళనం, 22 వ తేదీన పాత బస్టాండ్ సెంటర్, వేములవారి సెంటర్ లో వర్ధంతి సభలు జరుగుతాయని తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో 20వ తేదీ న రక్తదాన శిబిరం మాజీ మున్సిపల్ చైర్మన్ బొద్దుతులసి మంగతాయారు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నెకంటి సాయిప్రసాద్ ప్రారంభిస్తారని, సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జరిగే కవి సమ్మేళనం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభిస్తారని, వర్ధంతి సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు పాల్గొంటారని తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం లో కేదారి నాగు, చల్లా విశ్వనాథం, డి సత్యనారాయణ, కూనిరెడ్డి నరసింహామూర్తి, రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## యర్నగూడెం దేవాదాయ భూముల వేలంపై జనసేన ఆందోళన



**గోపాలపురం, జూన్ 18 (ప్రభాతవార్త):** గోపాలపురం నియోజకవర్గంలోని, దేవరపల్లి మండలం, యర్నగూడెంలోని దేవాదాయ శాఖకు చెందిన వ్యవసాయ భూముల వేలం పాట నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు ఆరోపించారు. బుధవారం గోపాలపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్స్ ఈవో నాగరాజుకు సువర్ణరాజు ఆధ్వర్యంలో జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. సువర్ణరాజు మాట్లాడుతూ.. వేలం ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలు, నిబంధనల ఉల్లంఘునలపై ఈవో దృష్టికి తీసుకెళ్లటం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఈవో నాగరాజు, జరిగిన లోపాలను పరిశీలించి సరిదిద్ది త్వరలోనే నిబంధనల ప్రకారం పారదర్శకంగా తిరిగి వేలం నిర్వహిస్తామని వ్రాతపూర్వకంగా హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రజా ప్రయోజనాలు, రైతుల హక్కులను పరిరక్షించే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వి.రామలీల, నాయకులు ఎం.నాగేంద్ర, వి.నరేంద్ర, డి.లీలా గంగాధర్, సాయి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలను ప్రజలకు అందేవిధంగా వేగవంతం చెయ్యాలి....

### - ఎంపీడీఓ,వెంకట రామన్.



**ఆత్రేయపురం, జూన్ 18,(ప్రభాత వార్త)** ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా, అందించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ పేర్కొన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ వారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గురువారం అన్ని పంచాయితీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్ లకు పంచాయతీరాజ్ సిబ్బంది సామర్థ్య అభివృద్ధికి శిక్షణ అవసరాల విశ్లేషణ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ మాట్లాడుతూ శిక్షణ అవసరాల విశ్లేషణ ద్వారా పంచాయతీరాజ్ సిబ్బంది యొక్క ప్రస్తుత జ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, విధుల నిర్వహణ సామర్థ్యాలు,మెరుగుపరచాల్సిన నైపుణ్యాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. సిబ్బంది అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను రూపొందించి, పరిపాలన, ఆర్థిక నిర్వహణ, డిజిటల్ సేవలు, సంక్షేమ పథకాల అమలు, చట్టపరమైన అంశాలలో వారి సామర్థ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో సుపరిపాలనను ప్రోత్సహించడం, పంచాయతీరాజ్ సంస్థలను మరింత శక్తివంతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలోఎస్ కే కే ఎం విద్యార్థుల ప్రతిభ



**పెద్దాపురం, జూన్ 18 (ప్రభాత వార్త)**ఇంటర్ ఫలితాల్లో ఎస్ కే కే ఎం విద్యార్థులు మంచి ఫలితాలను సాధించినారు జూనియర్ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎంపీసీ గ్రూప్ నందు పి. లీల రత్నశ్రీ 470మార్కులకుగాను 465 మార్కులు సాధించి పెద్దాపురం టౌన్ నందు ప్రథమ స్థానం సాధించింది.ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సమావేశం లో మంచిఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఆమెను అభినదించారు.ఈ సమావేశం కళాశాలప్రిన్సిపాల్ శ్రీ వి.ఎస్. చక్రవర్తి కళాశాల చైర్మన్ శ్రీ కే.వి.ఆర్. మూర్తి, డైరెక్టర్లు ఎం. చక్రం, పి. ఏసుబాబు పీ. మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెం జూనియర్ కళాశాలలో విద్యామిత్ర పుస్తకాల పంపిణీ



**రావులపాలెం, జూన్ 18 (ప్రభాతవార్త) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావులపాలెం ప్రాంగణంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి. సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంటర్ వృత్తి విద్యాధికారి కె. చంద్రశేఖర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పాఠ్యపుస్తకాల ప్రాధాన్యతను వివరించి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అందుతున్న విద్యా బోధన, గత ఏడాది ఉత్తీర్ణత ఫలితాలు, విద్యార్థులు పాటించాల్సిన క్రమశిక్షణ గురించి వివరించారు అనంతరం అధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రంథాలయ అధ్యాపకులు మరియు ఇతర అధ్యాపకుల సహకారంతో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కార్యదర్శి కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ సభ్యులు జక్కంపూడి రామకృష్ణ, కొవ్వూరి వెంకటరెడ్డి, పల్లా శ్రీను, సీనియర్ అధ్యాపకులు జి.వి. రమణ, టి. రాకేష్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# యానాం డంపింగ్ యార్డ్ ను అడ్డుకుంటాం.

### -ఇది అంతర్రాష్ట్ర సమస్య.-జాతీయ సర్వే అధికారులు తేల్చాలి.-అఖిలపక్ష నాయకుల డిమాండ్.



**తాళ్లరేవు, జూన్ 18(ప్రభాతవాం):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయితీ తూర్పు పేట వద్ద ఆంధ్రా, యానాం సరిహద్దు ప్రాంతంలో యానాం అధికారులు ఏర్పాటు చేయనున్న మురికి నీరు శుద్ధి కర్మాగారాన్ని అడ్డుకుని తీరుతామని మండల అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. కర్మాగారం నిర్మాణానికి ప్రయత్నిస్తున్న భూమికి యానం ప్రాంతానికి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. ఈ విషయమై వివాదాస్పద భూమి వద్ద గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ యానం, ఆంధ్ర సరిహద్దు సమస్య సుదీర్ఘంగా కొనసాగుతుందన్నారు. ఇక్కడ భూములు కొనుగోలు చేసిన అనేకమంది రైతులు కోర్టును ఆశ్రయించడం జరిగిందని, ఇప్పటికీ కొన్ని కోర్టు పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని సర్వే చేయాలంటే అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్య కారణంగా జాతీయ సర్వే అధికారులు రావాల్సి ఉందన్నారు. గతంలో తాము పోరాటం చేసిన నేపథ్యంలో సర్వే చేయడం జరిగిందని ఈ ప్రాంతమంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉన్నట్లుగా అధికారులు గుర్తించారన్నారు. ఈ ప్రాంతంలో మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయటానికి అంగీకరించమన్నారు. ఈ అంశంపై దశలవారీగా పోరాటం చేయడానికి సిద్ధమవుతామని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈనెల 25 తరువాత ముమ్మిడివరం శాసనసభ్యులతో సమావేశం నిర్వహించి యానం ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించటానికి కృషి చేస్తామని టిడిపి మండల అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ తెలిపారు. అప్పటివరకు యానం అధికారులు ఈ ప్రాంతంలో ఎటువంటి పనులు చేపట్టరాదని కోరారు. సీనియర్ నాయకులు జక్కల ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షులు అత్తిలి బాబురావు, సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ పిల్లి సత్తిబాబు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, వైసీపీ నాయకులు కాశి లక్ష్మణస్వామి, బొంతు మోహన్, టిడిపి నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు, టేకుమూడి సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, వడ్లమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల ప్రజలకు తీరని కరెంట్ కష్టాలు!

### -వార్త దినపత్రిక ప్రత్యేక కథనం



**అడ్డతీగల, జూన్ 18, ప్రభాతవార్త** మండల కేంద్రమైన అడ్డతీగల మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు విద్యుత్ కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యకు ఎప్పుడు పరిష్కారం దొరుకుతుందా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పవనగిరి వెనుక భాగం నుండి వస్తున్న ప్రధాన విద్యుత్ లైన్ కారణంగానే ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?ఈ పాత విద్యుత్ లైన్‌ను మార్చాలని, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సరఫరా పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు ఎన్నోసార్లు విద్యుత్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా సరే, ఇప్పటివరకు ఎవరూ దీనిపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు కేవలం హామీలకే పరిమితమవుతున్నారని, ఈ సమస్య ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదని గ్రామస్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజల భయాలు మరింత ఎక్కువయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా, లేదా కాస్త గాలి వీచినా చాలు... పవనగిరి లైన్ పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. దీంతో గంటల తరబడి, కొన్నిసార్లు రోజుమొత్తం చీకట్లోనే గడపాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.?మరోవైపు, చిన్నపాటి అంతరాయం ఏర్పడినా లైన్‌ను పునరుద్ధరించడానికి విద్యుత్ శాఖ సిబ్బంది కూడా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అడవి, కొండ ప్రాంతాల గుండా ఉన్న ఈ లైన్ పర్యవేక్షణ సిబ్బందికి కూడా సవాలుగా మారింది.?ఇప్పటికైనా ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు స్పందించి, పవనగిరి వెనకాల ఉన్న విద్యుత్ లైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, అడ్డతీగల ప్రాంత ప్రజలను ఈ అంధకార కష్టాల నుండి గట్టెక్కించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## తిమ్మాపురం గ్రామంలో ఘనంగా టెంపుల్ యోగా కార్యక్రమం?

**అడ్డతీగల,జూన్ 18, ప్రభాతవార్త** పోలవరం జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామంలోని స్థానిక శివాలయం వద్ద టెంపుల్ యోగా కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.వి.వి. కుమార్, మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్, ఆయుష్ డాక్టర్ రేష్మ సుల్తానా, ఏపీవో చిరంజీవి హాజరయ్యారు.?ఈ సందర్భంగా ఎంపీడీవో ఏ.వి.వి. కుమార్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ప్రశాంతమైన గుడి వాతావరణంలో యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. పిడి పీఈటిలు ఆధ్వర్యంలో పలు ఆసనాలు, ప్రాణాయామం చేయించి, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.?ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పెద్దకాపు, పిటి, పీడీలు, స్వర్ణ గ్రామం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని యోగాసనాలు వేశారు.

## వెలుగు ఏ. పి. యంగా మధుబాబు



**రాజవొమ్మంగి, జూన్ 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల వెలుగు ఏ. పి. యంగా మధుబాబు ను నియమిస్తూ ఉత్వర్డులను జారీ చేసినట్లు పోలవరం జిల్లా పి. డి. దా. దాసరి రత్నాకరరావు తెలిపారు. ఇప్పటి వరకూ డివిజన్ స్థాయి హెచ్. డి. ఏ పి. యంగా మధుబాబు విధులను నిర్వహించారు. 19 తేదీ శుక్రవారం రాజవొమ్మంగి ఏ. పి. ఎంగా విధుల్లోకి చేరనున్నారు. కేవలం 10 రోజులు పాటు ఏ. పి. యం గా విధులను నిర్వహించిన దుర్గాప్రసాద్ డి. పి. యంగా పదోన్నతి రావడం జరిగింది.

## మోటార్ బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి..

### -సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గిడ్డి ఆదేశం..



**అంబాజీపేట ( పి.గన్నవరం), జూన్ 18, (ప్రభాతవార్త)..** పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామంలో గురువారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. పోతవరం గ్రామానికి చెందిన కొప్పాడి శ్రీనివాసరావు (45)ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురై బైక్‌పై నుంచి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు.అదే సమయంలో అటుగా వెళు న్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఘటనను గమనించి వెంటనే వాహనం ఆపి పరిస్థితిని పరిశీలించారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ఘటనపై ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ప్రయాణాల సమయంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అస్వస్థత అనిపించిన వెంటనే ప్రయాణాన్ని నిలిపివేసి వైద్య సహాయం పొందాలని సూచించారు. మృతుడు శ్రీనివాసరావు కొత్తపేట ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.ఈయన కవిగా పేరుగాంచారు.పలు సినిమాలకు పాటలు రచించారు. కళా సేవకు గుర్తుగా ఈయనకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆక్వా రైతు కృష్ణంరాజు దారుణ హత్య.



**ముమ్మిడివరం జూన్ 18(ప్రభాతవార్త)**ఐ పోలవరం మండలం కొత్త మురమళ్ళ లో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు(64)ను కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసినట్లు అనుమానిస్తున్నారు .కృష్ణంరాజు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో గాలించి ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు.పోలీసులు గాలింపు చేపట్టగా చెరువులో రాళ్లతో కట్టిన కృష్ణంరాజు మృతదేహం గుర్తింపు. ముమ్మిడివరం సీఐ ఎం మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఐ పోలవరం ఎస్సై ఎంవివి రవీంద్రబాబుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య బాధితులకు నిత్యావసర సరుకులు అందజేతయు.కొత్తపల్లి, జూన్ 18(ప్రభాతవార్త) :మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన పేకేటి సుబ్రహ్మణ్యం దంపతులు అనారోగ్యంతో ఉండడంతో గురువారం గ్రామానికి చెందిన మడదా రాజేశ్వరి రూ. 2వేలు విలువ జేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతీ ఒక్కరూ విధిగా భావించాలని, తమకు ఉన్నంతలో ఆదుకోవాలని అన్నారు.

## రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును సత్కరించిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్,జూన్ 18 (ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, రెండో సారిరాజ్యసభ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన సానా సతీష్ బాబు ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ,తనయుడు సందీప్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. గురువారం కాకినాడ గోదారిగుంట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన సానా సతీష్ ఎమ్మెల్యే నానాజీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ల కాలంలో రూరల్ నియోజకవర్గ వ్యాప్తంగా మునుపెన్నడు లేని స్థాయిలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ప్రగతి,కేంద్రం నుండి రావలసిన నిధులపై చర్చించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే సమన్వయంతో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని కాకినాడను అన్ని రంగాల్లో మరింత అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడిగా ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు,కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్ ను కలసిన జమ్మలమడక నాగమణి

### - పార్టీ కోసం నాగమణి చేస్తున్న సేవలకు జగన్ ప్రశంస



**కాకినాడ రూరల్,జూన్ 18( ప్రభాతవార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైసిపి మహిళా విభాగం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి మర్యాదపూర్వకంగా కలిసారు.గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన భేటీ అనంతరం జమ్మలమడక నాగమణి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనపై జనం తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని ,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆమెను ప్రశంసించారని తెలిపారు.గడచిన రెండేళ్ల కాలంలో సంక్షేమాన్ని అటకెక్కించి అన్ని వర్గాల ప్రజలను ముంచేసిన చంద్రబాబు పై పోరాటానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ,రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటం చేయాలని జగన్ సూచించారని నాగమణి వెల్లడించారు.

## సముద్ర తీరాల్లో పర్యాటక అభివృద్ధి పేరుతో యువతరాన్ని నాశనం చేయవద్దు

### - సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు



**కాకినాడ రూరల్, జూన్ 18 ( ప్రభాతవార్త):**సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పేరుతో బీచ్ షాక్స్ ఏర్పాటు చేసి యువతరాన్ని నాశనం చేయవద్దంటు ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మద్యం షాపులు, బార్లు, అనధికార బెల్ట్ షాపులు, గంజాయి, గుట్కా, సారా వంటి మహమ్మరిలన్నీ కాకినాడ యువతను భ్రష్టు పట్టిస్తుంటే ఇప్పుడు పర్యాటకం పేరిట ప్రభుత్వం తీసుకువస్తున్న బీచ్ షాక్స్ ను వెంటనే ఉపసమహరించుకోవాలని లేదా ప్రజావ్యతిరేకతను మూటకట్టు కోవాల్సి వస్తుందని ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు హెచ్చరించారు. బీచ్ షాక్స్ వలన యువత భవిష్యత్ ప్రగతికి కరెంట్ షాక్ తరహాగా ఉందని ప్రముఖసామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు నిరసన వ్యక్తం చేశారు. రూరల్ మండలం సూర్యారావుపేటలోఎన్ టి ఆర్ బీచ్ లో గురువారం ఉదయం బీచ్ షాక్స్ వద్దు సముద్ర తీరాల్లో యువతరాన్ని నాశనం చేయవద్దని పేర్కొంటూ ప్లకార్డ్ తో ప్రదర్శన చేపట్టారు.

## పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ

### -20 ఏళ్లుగా నిరంతర విద్యాసేవ చేస్తున్న కర్రి శ్రీనివాస్



**కాట్రేనికోన జూన్ 18 (ప్రభాతవార్త)** విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో కర్రి శ్రీనివాస్ విద్యా సేవా సమితి అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్ గత 20 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.కాట్రేనికోనమండలం నడవపల్లి గ్రామంలోని పల్లిపాలెంకు చెందిన కర్రి శ్రీనివాస్ తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుంటూ, నేటి విద్యార్థులు అలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ 15న తన జన్మదినాన్ని పురస్కరించుకుని వందలాది మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు పంపిణీ చేస్తున్నారు.కుంచనపల్లి, పల్లిపాలెం, పల్లంకుర్రు, కుండలేశ్వరం, నడవపల్లి, లచ్చిరాజుచెరువు, వెంకమ్మచెరువు, కొప్పిగుంట తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆయన ప్రతి సంవత్సరం విద్యా సామగ్రి అందిస్తున్నారు. గత ఏడాది 650 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయగా, ఈ ఏడాది ఇప్పటికే 450 మందికి పైగా విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం నడవపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు కర్రి శ్రీనివాస్ సోదరుడు రామకృష్ణ చేతుల మీదుగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు నా వంతు సహాయం చేయాలనే సంకల్పంతోనే గత 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాను అని తెలిపారు ఆయన సేవలను తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు .గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుందరరావు, నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకే ప్రాధాన్యం

### -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్15.50 లక్షల సీసీ డ్రైనేజీ పనులకు సంస్థాపన



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18( ప్రభాతవార్త)**నగర అభివృద్ధిలో ప్రజల అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. గురువారం నగరంలోని 39 వ డివిజన్ పరిధిలోని తుమ్మ లోవ సందు కృష్ణానగర్ ప్రాంతాల్లో15.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైనేజ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ డివిజన్ ఇంచార్జ్ ప్రదీప్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 39 వ వార్డులో రెండు కోట్ల 30 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టమన్నారు. మరో కోటి 40 లక్షల అభివృద్ధి పనులు టెండర్ దశలో ఉన్నాయని వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ఈ సమస్యలను శాశ్వతముగ పరిష్కరించేందుకు సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. స్థానిక వృద్ధ మహిళలు నివాసితులు తమ సమస్యలను వివరించిన వెంటనే అధికారులు ఇంజనీర్లతో పరిశీలన నిర్వహించి 8.50 లక్షలతో డ్రైనేజీ కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రజల సహకారంతో నగరంలోని మౌలిక సదుపాయాలు అన్నింటిని మెరుగుపరుస్తూ సమగ్ర అభివృద్ధి సాధిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్పొరేషన్ అధికారులు ఇంజనీరింగ్ సిబ్బంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ దొంగలు ముఠా అరెస్టు వాహనాలు స్వాధీనం.



**అనపర్తి జూన్ 18 (ప్రభాత వార్త )** చెడు అలవాట్లకు బానిసలై సులావుగా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో మోటారు సైకిళ్ళు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అనపర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుండి సుమారు 7 లక్షలు విలువైన 14 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం అనపర్తి పోలీస్ సర్కిల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డిఎస్పి బి. విద్య, సిఐ సుమంత్, ఎస్సై వినయ్ ప్రతాప్ కలిసి వివరాలనువెల్లడించారు.బుధవారం అనపర్తి ఐఎల్ టిడి జంక్షన్ లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజమండ్రి కి చెందిన దుప్పాడ అనిల్ కుమార్ (బూస్ట్), పీరారామచంద్రపురం గ్రామానికి చెందిన బహదూర్ (బబ్లు) తోపాటు అనపర్తి గ్రామానికి చెందిన మరో మైనర్ బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దుప్పాడ అనిల్ కుమార్, పై 16 దొంగతనం కేసులు ఉన్నట్టు తెలిపారు. వాటిలో కొన్ని కేసులలో శిక్ష అనుభవించగా మరికొన్ని కేసులు వివిధ కోర్టులో విచారణలో ఉన్నాయి. ఇటీవల కాలంలో ముగ్గురు నిందితులు కలిసి ఇళ్ల ముందు పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను మారు తాళాలతో తెరిచి దొంగతనాలకు పాల్పడుతూ అనపర్తి పోలీసులకు చిక్కారు.అనపర్తి,రాజానగరం, గోకవరం,గండేపల్లి, కిర్లంపూడి, రాజమండ్రి, పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో మొత్తం 14 మోటారు సైకిళ్లను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైనట్లు డీఎస్పీ మీడియా కు వివరించారు. నిందితులలో మైనర్ బాలుడిని జువైనల్ హోం కు తరలించగా,మరో ఇద్దరిని అనపర్తి కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్పి తెలిపారు. కేసు పర్యవేక్షించిన సిఐ వి ఎల్ వి కే సుమంత్, అనపర్తి ఎస్సై వినయ్ ప్రతాప్, క్రైమ్ కానిస్టేబుళ్లు శివ, త్రిమూర్తులు స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహా కిషోర్,డిఎస్పి విద్య అభినందించారు.

## వర సిద్ధివినాయకునికి మకరతోరణం బహూకరణ..



**సఖినేటిపల్లి జూన్ 18, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో 16 స్తంభాల మండపం వద్ద శ్రీ వర సిద్ధి వినాయక స్వామి వారికి ఇత్తడి మకర తోరణం ను అంతర్వేది వాస్తవ్యులు వాడపల్లి సత్తిబాబు శేషారత్నం దంపతులు, కుటుంబ సభ్యులు బహూకరించారు. శాస్త్రోత్సంగా చింతా వెంకట శాస్త్రి పురోహిత్యంలో మకారతోరణం నాకు సంప్రోక్షంను నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ యువత కమిటీ సభ్యులతో స్వామికి అలంకరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకు కుమార్, పుల్లయాచార్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అమర్‌నాథ్‌పై టీడీపీ మహిళాగ్రహం



**రామచంద్రాపురం,జూన్ 18 (ప్రభాత వార్త):** రాష్ట్ర హోం మంత్రి వంగళపూడి అనితపై వైకాపా నేత గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి జాస్తి విజయలక్ష్మి,పట్టణ మహిళా అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.అమర్‌నాథ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ.. హోం మంత్రి అనితను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత దురదృష్టకరమన్నారు.రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ,ఇలా వ్యక్తిత్వ హననానికి దిగడం వైకాపా దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.మహిళా మంత్రిని అవమానించడం అంటే రాష్ట్ర మహిళా లోకాన్ని అవమానించడమేనని,అమర్‌నాథ్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మహిళలపై అసభ్య పదజాలం ఉపయోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.

## జడ్డంగి ఆశ్రమోన్నత పాఠశాలను ఏ. టి. డబ్ల్యూ. ఓ తనిఖీ



**రాజవొమ్మంగి, జూన్ 18, ప్రభాతవార్త** జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికొన్నత అశ్రమ పాఠశాలను గురువారం ఏ. టి. డబ్ల్యూ. ఓ కృషమోహన్ తనిఖీ చేశారు. రికార్థులను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లు, మరుగుదొడ్లను చూసారు. మోనో ను పరిశీలించారు. విద్యార్థినుల సంఖ్య 191 నుండి 240 వరకూ పెరిగేలా చూడాలని హెచ్. యం. బి. లక్ష్మమ్మ కు సూచించారు. విద్యార్థినుల పఠనాశక్తి ని చూసారు. ఈకార్యక్రమంలో ఏ. టి. డబ్ల్యూ. ఓ లక్ష్మమ్మ, వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు సత్యవతి, వెంకటరత్నం, ఆశ, రీతూ వినయ్, హైమా, పద్మావతి, దుర్గాదేవి పాల్గొన్నారు.

## పిల్లంకలో నూతన విగ్రహాలకు ఘనంగా జలాధివాసం.



**తాళ్లరేవు, జూన్ 18( ప్రభాతవార్త ):** మండలంలోని పిల్లంక నదీ తీరంలో పునఃనిర్మించిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల లో భాగంగా గురువారం నూతన విగ్రహాలకు ఘనంగా జలాధివాసం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, వేద పండితులు వేలూరి కాశిబాబు పర్యవేక్షణలో ఏలూరిపాటి ప్రభాకర్ శర్మ బ్రహ్మత్వం లో వారణాసి హనుమత్ శర్మ, గుత్తెన రవి శర్మ, మర్ల ఫణిశర్మ, మేడవరపు బ్రహ్మన్న శర్మ, చావలి రవి శర్మ, వేదుల హనుమాన్, తెనాలి, విజయవాడ నుంచి వచ్చిన వేదపండితులచే కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా వాస్తు హోమం, జలాధి వాస హోమములు, మూలమంత్ర హవనములు, క్షీరాధివాసము తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్టించనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నవగ్రహాల విగ్రహాలు, శిఖరాలకు జలాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి ఈ అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు, రిత్వికులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అల్పాహారం, రాత్రి భోజనం సదుపాయాలను దాత కనుమూరి శ్రీనివాసరాజు సహకారంతో ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అనుమతులు లేకుండా కార్పోరేట్ వైద్యం ఆర్ఎంపీలపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుబ్బరాజు ఆగ్రహం



**యు.కొత్తపల్లి, జూన్ 18(ప్రభాతవార్త) :**రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్.ఎం.పీ) అనుమతులు లేకుండా రోగులకు వైద్యాన్ని అందించడం పై కాకినాడ జిల్లా డివిజనల్ ప్రోగ్రాం అధికారి, ఇమ్యునైజేషన్ అధికారి కే.వీ. సుబ్బరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అమీనాబాదు సెంటర్లో ఉన్న పండు క్లినిక్, సత్య క్లినిక్లను గురువారం ఆయన పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా క్లినిక్ లు నిర్వహించమేమిటంటూ ప్రశ్నించారు. అనుమతి పత్రాలు చూపించాలంటూ నిలదీసారు. అమీనాబాదు సెంటర్లో అర్ఎంపీలు క్లినిక్ల పేరుతో పడకలను ఏర్పాటు చేసి కార్పోరేట్ తరహా వైద్యం అందిచడాన్ని తప్పు బట్టారు. ఇటువంటివి మరలా పునరావృత్తం అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు రోగులకు వైద్య పరిక్షలను అందించడం జరుగుతుందని పిర్యాదు రావడంతో పరిశీలనకు రావడం జరిగిందన్నారు. రోగులకు సెలైన్లు పెట్టడం, ఇంజక్షన్లు, ప్రథమ చికిత్స, రక్త పరీక్షలు చేయడం, పడకలను ఏర్పాటు చేయడం చేయరాదన్నారు. ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) చేసి సర్టిఫికెట్ ఉన్నవారు మాత్రమే ప్రథమ చికిత్స అందజేసేందుకు అర్హులన్నారు. సత్యక్లినిక్ నిర్వహిస్తున్న వారికి గతంలోనే నోటీసులు జారీ చేసి హెచ్చరించడం జరిగిందన్నారు. అయినా యధావిధిగా క్లినిక్ నిర్వహించడం గమనించడం జరిగిందని, పండు క్లినిక్ యజమాని లేకపోవడంతో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయానికి అనుమతి పత్రాలు తీసుకురావాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆయన వెంట వైద్యాధికారిణి సుష్మ, సిబ్బంది ఉన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# రెండేళ్ల కూటమి పాలన విజయోత్సవాలు ఘనంగా జరపాలి:



## -ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:

**జగ్గంపేట, జూన్ 18(ప్రభాత వార్త)** రావులమ్మ నగర్ టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై క్యాడర్ కు దిశానిర్దేశం చేశారు.జూన్ 21 ఆదివారం పరిణయ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి రెండేళ్ల కూటమి పాలన విజయోత్సవ వేడుకలు. ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలన్నారు.జూన్ 25 నుండి 45 రోజులు నియోజకవర్గంలో ఉదయం, సాయంత్రం పర్యటన. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి.జూన్ 14 నుండి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం జరుగుతుందని బీఎల్ఏలు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇంచార్జ్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదుపై పూర్తి అవగాహన కల్పించాలి.-రాబోయే 4 నెలలు కాలంలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, సొసైటీ ఎన్నికలు. ఓటర్ల నమోదు పెంచి స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగరవేయాలని నెహ్రూ అన్నారు .అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో 80 కార్లతో ర్యాలీగా కాకినాడలో జరుగుతున్న జిల్లా స్థాయి కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, పైడిపాల సూరిబాబు, తోట రవి, తోట గాంధీ,పాలచర్ల నాగేంద్ర చౌదరి, జంపన సీతారామచంద్ర వర్మ, దాసరి తమన్నా దొర తదితరులు పాల్గొన్నారు.

# మేకలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : ఎంపిపి లక్ష్మి



**వి.ఆర్.పురం,జూన్ 18,ప్రభాతవార్త** పిడుగుపాటుకు మేకలను కోల్పోయిన బాధిత గిరిజన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, ఎంపిపి కారం లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొప్పల్లి, శబరిరాయిగూడెం గ్రామల శివారు ప్రాంతమైన శబరినది ఒడ్డున పిడుగుపడి 57 మేకలు మరణించిన విషయం పాఠకులకు విదితమే. గురువారం ఎంపిపి లక్ష్మి ఘటనా స్థలాన్ని సమర్శించి చలించిపోయారు. పిడుగుపాటుకు ఇంత పెద్ద మొత్తంలో మేకలు మరణించటం వి.ఆర్.పురం చరిత్రలో ఇదే మొదటిదన్నారు. ప్రకృతి విపత్తులను ఎవరం అడ్డుకోలేమని, ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయినవారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్.డి.ఆర్.ఎఫ్) నిధుల ద్వారా ఒక్కొక్క రైతుకు రూ 2 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఆమె ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం బాధిత రైతులు కారం మారయ్య, కారం సీతారామయ్య, కారం సీతయ్య, ఉయికా లక్ష్మయ్య, సరియం లక్ష్మయ్య, ఉయిక చిన్నమ్మి లను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎంపిపి వెంట సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లాది రమేష్, కుంజా సుదీర్ తదితరులు ఉన్నారు.

# విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రంలో రెండేళ్ల పాలనలో నమ్మకం సంక్షేమం అభివృద్ధిరెండేళ్ల విజయోత్సవ సభలో ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట,జూన్18,(ప్రభాతవార్త)** విధ్వంసం నుండి వికాసం వైపు సంక్షోభం నుండి స్వర్ణంధ్ర వైపు ఆంధ్రప్రదేశ్ రూపురేకలు మారుతున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన రెండేళ్ల విజయోత్సవ సభలో అయన జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి జనసేన పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్ బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సాయి ఏపీ బిసి కోపరేటివ్ ఫైనాన్స్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి కొత్తపేట నియోజకవర్గ అబ్జర్వర్ కన్నబాబు సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ ఏఎంసి చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు ఏఎంసి వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు కూటమి నాయకులతో పాల్గొన్నారు ముందుగా కొత్తపేట సుబ్బరాజు కళ్యాణ మండపం నుండి మహిళా కార్యకర్తలతో కలిసి సైకిల్ ర్యాలీగా కాపు కళ్యాణ మండపం చేరుకున్నారు అనంతరం కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన సంక్షేమ పథకల స్టాల్స్ ను చూసి అక్కడ ఉన్న లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త చరిత్రను లిఖిస్తూ 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది సంక్షేమం అభివృద్ధి సూపరిపాలనతో ఇది ప్రజల ప్రభుత్వం ప్రగతి ప్రభుత్వం అనే ముద్రతో ప్రజల నమ్మకాన్ని గెలుచుకుందన్నారు తల్లికి వందనం నుండి స్త్రీ శక్తి వరకు అన్నదాత సుఖీభవ నుండి ఎన్టీఆర్ భరోసా వరకు మహిళా సాధికార నుండి యువత ఉపాధి వరకు రాజధాని అమరావతి నిర్మాణం నుంచి ప్రపంచ స్థాయి పెట్టుబడుల ఆకర్షణ వరకు ప్రతి రంగంలోనూ ప్రతి పౌరుడు గర్వించేల మన కూటమి ప్రభుత్వం పురోగతిని సంధించింది అని తెలిపారు కొత్తపేట నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు దానిలో ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు ఆధునికరణ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి రావులపాలెం మండలం దేవరపల్లి ఎం ఎస్ ఎం ఈ పార్క్ కొత్తపేట మండలం ఏనుగుమహల్ సబ్ స్టేషన్ కమ్మిరెడ్డి పాలెం రోడ్డు ఆలమూరు మండలం బదుగువానిలంక నాది కోత నివారణకు గో?వ్రేల్స్ నిర్మాణం నియోజకవర్గంలో 36 విల్లాజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు మొదలు పెట్టాము అని తెలిపారు

## ఉచితంగా నోటు పుస్తకాలు అందజేసిన సోమేశ్వరరావు



**గంగవరం, జూన్ 1,( ప్రభాతవార్త):** కె గంగవరం మండలం పామర్రు క్లస్టర్ పరిధిలో ఉన్నటువంటి 15 ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గాజువాక కు చెందిన శ్రీ మల్లికార్జున ట్రాన్స్ పోర్ట్ అధినేత బొజ్జంకి సోమేశ్వరరావు నోటు పుస్తకములు స్టేషనరీ సామాన్లు ఉచితంగా అందజేసినట్లు ప్రధాన ఉపాధ్యాయుడు వై ఈశ్వరుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఇవి అందించడం జరిగిందని ఎంఈఓ నాగరాజు తెలిపారు. ఇందుకుగాను ఉపాధ్యాయులు అప్పారావు చౌదరి, ప్రేమ్ కుమార్, వెంకటరమణ, శ్రీనివాస్, ఓవి రమణ, గుణవంతుడు, వెంకటరావు, మణికంఠ ,శిరీష ,చొల్లంగి శ్రీను ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు సోమేశ్వరరావు అభినందించారు.

## ఉపాధిహామీ ద్వారా పండ్లతోటలు సాగుకు అర్జీలు ఇవ్వండి.. ఏ. పి. ఓ. శ్రీనివాస్



**రాజవొమ్మంగి, జూన్ 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసేందుకు ఆశక్తి ఉన్న గిరిజన రైతులు ఫీల్డ్ అసిస్టెంట్స్ కు అర్జీని ఇవ్వాలని ఏ. పి. ఓ. శ్రీనివాస్ తెలిపారు. జీడిమామిడి, కొబ్బరి, మామిడి, జాఫ్రా, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, జామ వంటి పంటలకు అవకాశం ఉందన్నారు. మండలంలో కొండపల్లి, కింద్ర, అమీనాబాద్, లోదొడ్డి పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్స్ భర్తీ కావాలన్నారు. 2025 స. అగస్టు నెలలో సామాజిక తనిఖీల్లో తొలగించబడిన ఇద్దరు టి. ఏ లు, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్స్ కు తిరిగి విధుల్లో చేరడానికి ఆదేశాలు వచ్చాయన్నారు.

## కాకినాడ లయన్స్ సంకల్ప్ ఆధ్వర్యంలో...

### -పేదలకు దుస్తులు పంపిణీ.



**తాళ్ళరేవు, జూన్ 18 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప్ 316 బి ఆధ్వర్యంలో నిరాదరణ పొందిన మహిళలకు, పేద వృద్ధ మహిళలకు దుస్తులు, అవసరమైన సామాగ్రి గురువారం పంపిణీ చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామం శ్రీధర నిర్మలాశ్రమంలో ఎంపిక చేసిన 45 మందికి చీర, దుప్పటి, టవల్, జత చెప్పులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వారణాసి విజ్జి మాట్లాడారు.మా లయన్స్ క్లబ్ సభ్యురాలిగా ఉన్న సాలగ్రామ సుజాత గ్రామాన్ని గుర్తించినందుకు, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహ రాజు బృందం ద్వారా అర్హులైన పేదలను ఎంపిక చేసినందుకు ఆమె ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ద్వారా ఇప్పటికే మండలంలో చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను ఆమె గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ జిఎంటి మెంబర్షిప్ కోఆర్డినేటర్ మెట్టా రాధ మాట్లాడుతూ మత్స్యకార వృత్తి చేస్తున్న మహిళల కోసం త్వరలో గ్రామంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బుద్ధన దేవి, కోశాధికారి డాక్టర్ హరిణి జామి, లయన్స్ క్లబ్ సభ్యులు వాణి బిల్లా, పురాణపండ మహాలక్ష్మి, రత్నమాలతి కోకుల, సాలగ్రామ సుజాత, ఐ సి ఎం సంస్థ డైరెక్టర్ సాలగ్రామ వెంకటేష్, ఆశ్రమ నిర్వాహకులు కొపనాతి బాలకృష్ణ, స్థానికులు దాసరి రాజు, నాగేశ్వరరావు, హేమ సుందర రావు,రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్ భవనంను పంచాయితీకి స్వాధీనం చేయాలి..



**అంబాజీపేట, జూన్ 18, (ప్రభాతవార్త):** అంబాజీపేట మండలం ముక్కామలలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టి, ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనమును పంచాయితీకి స్వాధీనం చేసి, తద్వారా వచ్చే ఆదాయమును పంచాయతీకే చెందేలా సరియైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామంలో కొంతమంది జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముక్కామల పంచాయతీ కార్యాలయంలో అంబాజీపేట డిప్యూటీ ఎంపీడీవోలు కంచి శ్రీనివాస్,ఎండి అబ్బాస్ అలీ, మాచవరం పంచాయతీ కార్యదర్శి కే వి వి సత్యనారాయణలు గురువారం విచారణ చేపట్టారు.ముక్కామల లాకులకు సమీపంలో ఉన్న బస్సు రిక్వెస్ట్ స్టాప్ కు చెందిన స్థలంలో తాజా మాజీ సర్పంచ్ కుమారుడు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి,పంచాయితీకి సంబంధం లేకుండా ఇష్టమైన ధరలకు అమ్ముకున్నారని ఆరోపించారు.పంచాయతీకి చెందిన స్థలంలో భవనం నిర్మించి పంచాయతీకి తెలియకుండా షాపులను అమ్ముకోవడం దారుణమన్నారు.తక్షణమే వాస్తవాలను తెలుసుకుని షాపింగ్ కాంప్లెక్స్ భవనంను స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించి, అధికారుల సమక్షంలో షాపులను లీజుకు ఇవ్వాలని మాజీ సర్పంచిలు, గ్రామస్తులు విచారణ అధికారులకు తెలియజేశారు.2024 ముందు బస్ స్టేషన్ కు సంబంధించిన స్థలములో ఉన్న శిథిలమైన ఇంటిని పంచాయతీ అనుమతి లేకుండా కూల్చడంతో పాటు భవనం నిర్మించి 2025 మార్చిలో ప్రారంభించి,షాపులు అమ్ముకున్నారని ఆరోపించారు..అమలాపురం పార్లమెంటు సభ్యులుగా దివంగత నాయకుడు జిఎంసి బాలయోగి ఉన్న సమయంలో పిడబ్ల్యూడి కి చెందిన స్థలాన్ని1997లో పంచాయితీకి బదలాయించి 2001లో బస్ రిక్వెస్ట్ స్టాఫ్ భవనం నిర్మించారన్నారు.అప్పటినుంచి బస్ స్టేషన్ ముక్కామల పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు.గత ఏడాది ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనం ను స్వాధీనం చేసుకోకపోవడంతో,వాటి ద్వారా వచ్చే ఆదాయంను కూడా పంచాయతీ కోల్పోయిందన్నారు.అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి కాంప్లెక్స్ భవనం ను పంచాయతీకి స్వాధీనం చేయాలని గ్రామస్తులు కోరారు.జిల్లా అధికారులతో పాటు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ముక్కామల గ్రామ సమస్యను తీసుకెళ్లామని, ఆయన తక్షణమే స్పందించడంతో విచారణ చేపట్టారని ఫిర్యాదుదారులు తెలిపారు.ఫిర్యాదుదారుల నుండి,అప్పటి గ్రామ అధికారుల నుండి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారు ఇచ్చే ఆదేశాలను పాటిస్తామని విచారణ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నడుమూరు బాసి, దేవరపల్లి చిన్న బాలయోగి, కొప్పిశెట్టి విజయలక్ష్మి -రాంబాబు, ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ-పండు, తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## ఘనంగా రామదూత స్వామి జన్మదిన వేడుకలు...



**సఖినేటిపల్లి జూన్ 18, ప్రభాత వార్త:**అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలెం మెర్లకొడప గ్రామంలో గురువారం భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామి వారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద గొల్లమండల సునీల్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొని భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ సీతారాముల వారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు చక్ర పొంగలి పులిహోర ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దళితులూరి సీతారామరాజు, బొమ్మిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వానపల్లిలో పౌరాణిక నాటకాల ప్రదర్శన వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



**కొత్తపేట, జూన్ 18,(ప్రభాతవార్త)** మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న నాయుడు ఆధ్వర్యంలో ఆలయాన్ని పునర్ నిర్మించి సీతారాముల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం రాష్ట్రంలో పేరు ఎన్నిక కన్న నటీనటులతో పౌరాణిక నాటకాల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు తొలుత రామాంజనేయ యుద్ధం వార్ శీను ఘట్టాన్ని దివంగత పౌరాణిక నటులు కలియుగ ఆంజనేయ స్వామి సంపత్ నగరం పి లక్ష్మణరావు తనయుడు వీరాంజనేయులు రాముడు గాను పి లక్ష్మణరావు మనుమడు లక్ష్మణరావు ఆంజనేయులు గాను నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు అనంతరం సత్య హరిశ్చంద్ర ఫేమ్ డి వి సుబ్బారావు మనుమడు జూనియర్ డివి సుబ్బారావు హరిశ్చంద్రుడిగా రత్నకుమారి చంద్రమతిగా నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు పౌరాణిక అభిమానులకు కనువిందు కలిగించారు ఈ రోజుల్లో ఇట్లాంటి పౌరాణిక నాటకములను నిర్వహించిన అమ్మన్ననాయుడను పౌర ప్రముఖులు కొనియాడారు అనంతరం నాటక ప్రదర్శన చేసిన నటీనటులను అమ్మన్న నాయుడు ట్రాన్స్కో డి ఇ రామకృష్ణ మాజీ సర్పంచ్ సత్యానందం ప్రముఖ వ్యాపారవేత్తలు గొలకోటి సోమరాజు సింగిరెడ్డి గోవిందస్వామి చీకట్ల నాని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం సీనియర్ పాత్రికేయులు జగతా శ్రీ రామచంద్ర మూర్తి (రాంబాబు)తదితరులు ఘనంగా సత్కరించారు

## జూలై 4వ తేదీ శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం పాల్గొని తరించండి..ఈఓ, డి సురేష్ బాబు.



**ఆత్రేయపురం, జూన్ 18,(ప్రభాత వార్త)** స్వయంభు క్షేత్రం వెలుగొందుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి ఆలయంలో వచ్చే నెల 4. తేదీన జరగనున్న శ్రవణా నక్షత్ర మాస కళ్యాణంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీసులు పొందాలని ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొవాలని తెలియజేశారు .కావున భక్తులు మొబైల్ నెంబర్ : 99113 34733 ద్వారా సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుం రూ.750/- లు చెల్లించి పూజనందు పాల్గొవాలని. పూజలో పాల్గొనేని భక్తులకు ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు లు తెలిపారు. అలాగే విశాఖపట్నం చెందిన బీశెట్టి వెంకటఅప్పారావు, సత్యవతి దంపతులు శ్రీ స్వామివారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులకు రూ.5011/- వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదాలు చరిత్ర పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మండపేటకె



**గంగవరం, జూన్ 18, (ప్రభాతవార్త):** గంగవరం మండలం పాణింగపల్లి గ్రామానికి చెందిన సుధీర్ అనే క్రీడాకారుడు ఇటీవల ప్రమాదంలో మృతిచెందగా తన జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలో జిల్లాకు సంబంధించి 32 జట్లు పాల్గొనగా మండపేట జట్టు విజేతలుగా నిలిచారు. పామర్రు జట్టు రన్నర్ జట్టుగా పదివేల రూపాయలు బహుమతి గెలుపొందారు. మండపేట జట్టుకు ట్రోఫీ తో పాటు 20 వేల రూపాయలు నగదు ను ఎస్సై జి సోమేంద్ర,డాక్టర్ సతీష్, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరుడు తదితరులు అందించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయని, శరీరానికి అవసరమైన దృఢత్వాన్ని, మానసిక ఏకాగ్రతను పెంపొందిస్తాయని ఎస్సై జి సోమేంద్ర తెలిపారు. డాక్టర్ సతీష్ మాట్లాడుతూ క్రీడల వల్ల శరీరంలోని కండరాలు పటితనం మెరుగుపడటం, రక్త ప్రసరణ అన్ని అవయవాలకు సరఫరావడం, శరీరానికి చెమట పట్టడం వల్ల మలినాలు బయటికి వస్తాయని, ఏకాగ్రత పెరుగుతుందని దీనితో అనేక రోగాలను దూరం చేయవచ్చు అని తెలిపారు.

## సర్ సర్వేను పరిశీలించిన తహసీల్దార్



**కాట్రేనికోన, జూన్ 18(ప్రభాతవార్త)** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం(సర్)లో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే, ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేపడుతున్నారు. గురువారం నడవపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తహసీల్దార్ వి.రవికిరణ్ బీఎల్ఓల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఫారం పంపిణీ, వివరాల సేకరణ ప్రక్రియను తనిఖీ చేసి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఆన్లైన్‌లో 2002 మరియు 2025 ఓటరు జాబితాల వివరాలను మ్యాపింగ్ చేయాల్సి ఉందని, ప్రతి ఓటరు వివరాలను నిశితంగా పరిశీలించి అత్యంత పారదర్శకతతో ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ వారికి సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కాట్రేనికోన మండలంలో మొత్తం 65,126 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 6,773 మందికి ఎన్యూమరేషన్ ఫారం పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఫారం పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు ఆయన సూచించారు.

## మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి స్థలాల ఎంపిక ప్రక్రియ చేపట్టాలి.జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 18 ప్రభాత వార్త** అమలాపురం పట్టణంలో సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, నాచురల్ సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణాలకు అత్యంత అనువైన స్థలాలను తక్షణమే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రెవెన్యూ, పురపాలక సంఘ అధికారులను ఆదేశించారు.?గురువారం స్థానిక కలెక్టరేట్ నందు పురపాలక, రెవెన్యూ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుపల్లి పరిధిలో సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి, అలాగే సూర్యనగర్ మరియు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో నాచురల్ సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ?సహజ సిద్ధమైన నీటి ప్రవాహం కలిగి ఉండి పట్టణంలోని మేజర్ మురుగు కాలువలు నేరుగా కనెక్ట్ అయ్యేలా, ఎటువంటి అదనపు పంపింగ్ స్కీములతో అవసరం లేకుండా, సహజ సిద్ధమైన పరివాహక ప్రాంతం గుండా నీరు ప్రవహించేలా అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ?అప్రోచ్ రోడ్ల నిర్మాణంతో పాటుగా ప్లాంట్ల నిర్మాణానికి తదుపరి నిర్వహణకు అవసరమైన పెద్ద మిషనరీ నేరుగా వచ్చేందుకు వీలు గా విశాలమైన అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి,మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారిణి రాణి సంయుక్త, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్లు సుబ్బరాజు, నాగలక్ష్మమ్మ మరియు పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు పనులు పరిశీలించిన చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి



**గొల్లప్రోలు, జూన్ 18, (ప్రభాత వార్త)** గొల్లప్రోలు మండల పరిధిలో డబ్ల్యూడిసి, పీఎంఎస్ కే వై 2.0 పథకం క్రింద జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను గురువారం చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ పరిశీలించారు. 2 కోట్ల రూపాయల వ్యయంతో చేబ్రోలు గ్రామంలో గల కోటలంక వారి చెరువు,ఏపీ మల్లవరం,ఏకె మల్లవరం గ్రామాల్లో గల రెండు మంచినీటి చెరువులు అలాగే వన్నెపూడిలో గల మరో మంచినీటి చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి ఈ నెలాఖరు లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్,చెరువు గట్లు బలపరచడం వంటి నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు గోపీచంద్ కు వివరించారు.మిగతా సోలార్ లైట్లు, బెంచీలు,పిల్లల క్రీడ పరికరాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,పనులన్నీ నాణ్యతతో జరగాలని స్థానిక అధికారులను ఆదేశించారు.జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని సిక్యుసిటి గోపీచంద్ స్పష్టం చేశారు.మండల పరిధిలో ఒక్కొక్క చెరువు అభివృద్ధికి ప్రభుత్వం 50 లక్షల రూపాయలు కేటాయించిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమంలో ఎస్ క్యూ సి ఓ సురేష్, జే క్యు సి ఓ బాలాజీ , మండల అభివృద్ధి అధికారి సెలట్ రాజు, మండల ఉపాధి పథకం అధికారి బెజవాడ సత్యనారాయణ, జూనియర్ ఇంజనీర్ రాంజీ,టెక్నికల్ అసిస్టెంట్స్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విధ్వంసం నుండి వికాసం వైపు పి.గన్నవరం నియోజకవర్గం..

### - ఎమ్మెల్యే గిడ్డి..కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభ..



**అంబాజీపేట(పి.గన్నవరం), జూన్ 18, (ప్రభాతవార్త):** విధ్వంసం నుండి వికాసం వైపుగా రెండేళ్ల నుండి పి.గన్నవరం నియోజకవర్గం పయనిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.గంటి పెదపూడిలోని ధనవర్ష ఫంక్షన్ హాలులో నియోజకవర్గ టీడీపీ కో- కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో నియోజవర్గంలోని నాలుగు మండలాల నుండి కూటమి శ్రేణులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో నియోజవర్గంలో రూ.1000 కోట్లతో వివిధ అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు.ముఖ్యంగా రహదారులు,తాగు,సాగునీరు,విద్యుత్తు,లంక గ్రామాలను కలుపుతూ వారదుల నిర్మాణం, అప్పనపల్లి కాజ్వే వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రోత్సాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ల సహకారంతో నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహిళలకు అన్నవేదల కుటుంబ ప్రభుత్వం సహకారం అందిస్తుందని అమ్మఒడి, స్త్రీ శక్తి పథకం వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు.అభివృద్ధికి సహకరిస్తున్న కూటమి శ్రేణులకు,అధికారులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అనంతరం కూటమి శ్రేణులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోకా ఆనంద్ సాగర్, బిజెపి జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు,అంబటి భూలక్ష్మి, సూదా బాబ్జి, ఏఎంసి చైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దుల అను రాజేశ్వరి, మద్దాల సుబ్బారావు, పత్తిపాటి ఉమామహేశ్వరి,బోనం బాబు,వాసంశెట్టి కుమార్, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, కురసా అంజిబాబు, జాలెం శ్రీనివాసరాజా, చుట్టుగుళ్ళ దుర్గావతి-కిషోర్, మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమికి రెండు వసంతాల విజయోత్సవ సభ....



**సఖినేటిపల్లి/ మలికిపురం జూన్ 18, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం మలికిపురం ఎల్. ఎస్. ల్యాండ్ మార్క్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులతో నియోజవర్గ స్థాయి విజయోత్సవ సభను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, ఇంచార్జి గొల్లపల్లి అమూల్యా, మాజీ ఎమ్మెల్యే అయోజి వేమలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుచూ రాజోలు నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా కేసనపల్లి, పడమటిపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేది లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభిస్తామని, ఆర్ అండ్ బి, జిల్లా పరిషత్లో రోడ్లు వెడల్పు చేయాలని, అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం స్టేట్ ఫెస్టివల్ గా అనుమతి పోదామని, బస్ స్టేషన్, టెర్మినల్ కట్టాలని, కమ్యూనిటీ హాలులు, కామన్ స్పెసిలిటీస్, హెల్త్ సెక్టార్ పై ప్రత్యేక దృష్టి, విద్యపై శ్రద్ధ పెట్టాలి, ఎంప్లాయిమెంట్ ఆపర్చునిటీ తీసుకురావాలని, పంచాయతీ ఎన్నికలు కార్యకర్తలకు పరీక్ష లాంటిదని దీనిలో నాయకులు కార్యకర్తలు పాస్ అవ్వాలని ఒక్కరు కృషి చేయాలని, నాయకులు గ్రామ ప్రజలతో మమేకమై పనిచేయాలని, ప్రభుత్వం రైతులకు, విద్యార్థులకు, పంక్షన్ లు, తల్లికివందనం, చేనేత, మత్య కారులు, సీఎం రిలీఫ్ ఫండ్, గ్రామశాఖలు, నాయకులు ముందుండి నడపాలని వారిని కోరారు. అభివృద్ధి పనులు చేసిగ్రామపంచాయిలపై ప్రత్యేక దృష్టి కూటమి నాయకులు పెట్టాలని, అన్నివిధాల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు సం.ల కాలం పూర్తి చేసిన సందర్భంగా నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ ఆకన బాబ్జీ నాయుడు, జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీను, ఎంపీపీ సత్యవాణి, మంగిన భూదేవి, మలే శ్రీనివాస్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## దంగేరు పాఠశాలకు విరాళంగా కంచాలు గ్లాసులుకె.



**గంగవరం, జూన్ 18, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం దంగేరు జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు రిమ్మలపూడి శ్రీనివాస్ ఆదిలక్ష్మి దంపతులు సుమారు 300 కంచాలు గ్లాసులు విరాళంగా అందించినట్లు ప్రధానోపాధ్యాయులు గుణ్ణం శ్రీనివాస్ తెలిపారు. కాలిఫోర్నియాలో ఉంటున్న తన మనవరాలు యశ్న పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గుణ్ణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఎంసి చైర్ పర్సన్ మల్లెపూడు సూర్య భవాని వైస్ చైర్ పర్సన్ తోకల శ్రీదేవి,నల్ల రాంబాబు,రాయుడు సాంబశివరావు,లక్ష్మి ,జగదీష్ బాబు,రెడ్డి గంగరాజు తదితరులు శ్రీనివాస్ దంపతులను సన్మానించారు.

## జగన్ మాతో వస్తే , మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తా- మాధవ్



**రాజమహేంద్రవరంఅర్బన్, జూన్18(ప్రభాతవార్త)** రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు . పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి 160కిపైగా పథకాలను ప్రధాని మోదీ ప్రవేశపెట్టారన్నారు. పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా పొదుపు, బీమా పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేవలం రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ప్రమాద బీమా కల్పించారని, డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. అమరావతి నిర్మాణానికే కేంద్రం రూ.30 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. జగన్ మాతో వస్తే , మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తామని మాధవ్ అన్నారు. ఫ్రస్టేషన్, సెన్సేషన్ కోసమే జగన్ కొత్త నాటకాలని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగిందని మాధవ్ స్పష్టం చేశారు.




# అంగన్వాడీల పై వేధింపులు ఆపాలి...

## -జగ్గంపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు సి. హెచ్. రత్నం :

**జగ్గంపేట జూన్ 18 (ప్రభాత వార్త)** జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని అంగన్వాడి సెంటర్ ల ను విజిట్ చేసిన చోట అక్కడ పరిస్థితులు పిల్లలు స్టాకు చూసుకోవచ్చు కానీ ఆ అధికారిని అంగన్వాడిలను వేధింపులకు గురిచేస్తున్నారని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జగ్గంపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు సి.హెచ్ రత్నం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోషణ వారిగా పర్యవేక్షణకు సంబంధించి అంగన్వాడి వర్కర్లను నానా దుర్భాషలు ఆడుతూ అంగన్వాడీలను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రాజెక్టు సంబంధించిన పౌష్టికాహారము ప్రీస్కూల్ విద్య రికార్డులు తదితర విషయాలు సెంటర్లకు సరైన సమయంలో గుడ్లు, పాలు గర్భవతులు బాలింతలకు టి హెచ్ ఆర్ పంపిణీ కిట్లు బాలామృతము సరి అయిన సమయంలో అందుతున్నాయా లేదా అవి అందరికీ అందిస్తున్నారా ఇలాంటి విషయాలు గురించి పరిశీలన చేయాల్సి ఉంది కానీ అవి చేయకుండా అంగన్వాడీలను పర్సనల్గా మానసిక ఒత్తిడికి గురి చేస్తూ తిట్టడం పుస్తకాలు విసిరివేయడం వంటివి చేస్తూ ఉద్యోగం మానేయండి అని బెదిరింపులు చేస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగం మీద ఆధారపడి పనిచేస్తున్న అంగన్వాడీలను ఇలా వేధింపులు చేయడం తగదన్నారు. సిడిపిఓ అధికారిని ఆమె వైఖరి మార్చుకోకపోతే ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

## ట్రిప్పర్లు నుండి జారిపడుతున్న నల్లపిక్కరాయి..

### -ప్రమాదాలకు గురవుతున్న వాహన దారులు..- రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పిసిసి మెంబర్ ధరణాలకోట శ్రీను



**ప్రత్తిపాడు, జూన్ 18 (ప్రభాతవార్త)** ప్రత్తిపాడు పరిధిలోని ప్రధాన రహదారులపై క్వారీ లారీల రాకపోకలు వాహనదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మితిమీరిన లోడుతో నడుస్తున్న క్వారీ లారీల వల్ల నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా క్వారీల నుండి తరలిస్తున్న నల్లపిక్కరాయి లారీల నుండి జారి రోడ్డుపై పడుతుండటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.? జాతీయ రహదారి చిన్నంపేట జంక్షన్, ప్రత్తిపాడు, ఉత్తర చెరువు, ఫారెస్ట్ చెక్ పోస్ట్, నరేంద్ర గిరి అలాగే ప్రత్తిపాడు గ్రామంలో ఏగులమ్మ గుడి జంక్షన్ల వద్ద క్వారీ లారీల నుండి నల్లపిక్కరాయి పెద్ద ఎత్తున జారిపడుతోంది. మలుపులు తిరిగే సమయంలో, వేగంగా వెళ్లే క్రమంలో ఈ రాళ్లు రోడ్డుపై పడుతుండటంతో, వెనుక వచ్చే మోటార్ సైకిళ్లు, ఇతర చిన్న వాహనాలపై ప్రయాణించే వారు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు బైకర్లు ఈ రాళ్ల వల్ల కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ తీవ్రమైన సమస్యపై పీసీసీ సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను గురువారం ప్రత్తిపాడు నరేంద్ర గిరి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న కాకినాడ మోటార్ వాహన తనిఖీ అధికారి ఎన్. సబిత, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారి పి. సాయి బాబులను ఆయన స్వయంగా కలిసి సమస్యను వివరించారు. లారీలపై తార్పాలిన్ కవర్లు కట్టకుండా, పరిమితికి మించి లోడుతో వెళ్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.?దీనిపై రవాణా శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఓవర్‌లోడ్ క్వారీ లారీలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధరణాలకోట శ్రీనుకు అధికారులు హామీ ఇచ్చారు. ఈ ప్రమాదకర ప్రయాణానికి అడ్డుకట్ట వేసి, తమ ప్రాణాలను కాపాడాలని ప్రత్తిపాడు ప్రాంత ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## 'తార్ గ్యాంగ్' పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎస్సై లక్ష్మీకాంతం.



**ప్రత్తిపాడు, జూన్ 18 (ప్రభాతవార్త)** మధ్యప్రదేశ్‌కు చెందిన పేరుమోసిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా 'తార్ గ్యాంగ్' పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోందని, మండల ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం ఒక ప్రకటనలో కోరారు. గత వారం రోజులుగా ఈ ముఠా ఏలూరు, రాజమండ్రి పరిసరాల్లో ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందన్నారు.?ఈ నేపథ్యంలో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు బంగారం, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకూడదని సూచించారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులు, అపరిచితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే ఎ× (9440796570), జ× (9440796530) నంబర్లకు లేదా 112 (డయల్ 100) కు సమాచారం అందించాలని కోరారు. గురువారం మండల వ్యాప్తంగా పోలీసులు మైకుల ద్వారా ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించారు.--20 లీటర్ల నాటు సారా తో వ్యక్తి అరెస్ట్.. స్కూటీ స్వాధీనం.. 20 లీటర్ల నాటు సారా తో పాటు ఒక వ్యక్తిని స్కూటీతో అదుపులో తీసుకున్నట్లు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు మండలంలో ఒమ్మంగి గ్రామ శివారులో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నాటు సారాను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం పోలీస్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు.ఈ సందర్భంగా పెదశంకర్లపూడికి చెందిన దాట్ల లోవరాజు ను అదుపులోకి తీసుకుని.అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాతో పాటు రవాణాకు ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి:ఎన్జీఓ సంఘం



**రామచంద్రాపురం,జూన్ 18 (ప్రభాత వార్త):** ఉద్యోగుల సంక్షేమం,పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీఓ సంఘం నిరంతరం కృషి చేస్తోందని తాలూకా అధ్యక్షులు పెట్టా సత్యనారాయణ పేర్కొన్నారు.స్థానిక ఎన్జీఓ హోమ్‌లో గురువారం రామచంద్రాపురం తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12వ పీఆర్సీ కమిటీ నియామకం,సరెండర్ లీవుల బకాయిల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వంతో సంఘం నాయకులు నిరంతరం చర్చిస్తున్నట్లు తెలిపారు.విశ్రాంత ఉద్యోగుల బకాయిల విడుదల కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపి,విజయం సాధించిన రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్,జనరల్ సెక్రెటరీ డి.వి.రమణలకు ఈ సమావేశంలో తీర్మానం ద్వారా ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు.?సమావేశంలో తాలూకా ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్ కుమార్,ఇమామ్ షరీఫ్,కార్యదర్శి శ్రీనివాసరావు,సుబ్రహ్మణ్యం,జాయింట్ సెక్రెటరీ జి.అశోక్ మరియు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు



**శంఖవరం జూన్ 18 ప్రభాతవార్త**క్రమశిక్షణతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు అలవర్చుకోవాలని నియోజకవర్గ టిడిపి యువత అధ్యక్షులు కీర్తి సుభాష్ పేర్కొన్నారు. మండలంలోని వజ్ర కూటం గ్రామంలో గల ఎంపీయుపి పాఠశాలలో, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆదేశాల మేరకు, విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం లో భాగంగా, పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా, నిష్ణాతులైన బాధ్యత కలిగిన మంచి ఉపాధ్యాయులతో విద్యను అందిస్తూ ,కార్పొరేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అలవర్చుకొని వాటి సాధనకై కృషి చేయాలని ,విద్య తోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు. విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విద్య పై దృష్టి సారించి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు విద్యార్థులకు పుస్తకాలు బట్టలు బ్యాగులు మధ్యాహ్నం భోజనం వంటి సర్వ సదుపాయాలు కల్పించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగడం జరుగుతుందన్నారు విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి సుజాత తదితరులు పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps